క్లుప్తంగా

ముమ్మరంగా ఉపాధి పనులు



పెద్దకొత్తపల్లి: మారెడ్‌మాన్‌దిన్నే, వేడుకరావుపల్లి గ్రామాలలో ఉపాధిపనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పెద్దవాగుకు వెళ్లే కాల్వలో ఉన్న జమ్మును ఉపాధి కూలీలు తొలగించారు. జమ్ము తొలగించడంతో వాగుకు నీరు చేరింది. కార్యక్రమంలో భీముడునాయక్, లక్ష్మి, రాము, తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్ మాజీ కౌన్సిలర్ పసుపుల కృష్ణతో కలిసి ప్రారంభించారు. కలమంద శేఖర్, నాయకులు నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, కట్టా శ్రీనివాసులు, రాము, దేవని కుమార్‌మాదిగ తదితరులు ఉన్నారు.

సన్న బియ్యం పథకం పేదలకు వరం



మన్ననూర్: సన్నబియ్యం పంపిణీ పేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణ అన్నారు. సోమవారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని 6–9వ చౌకధరల దుకాణాలలో సన్న బియ్యాన్ని ఆయన పంపిణీ చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసులు, రామాంజనేయులు, నాయకులు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, సంతోష్, రేణయ్య, నాసరయ్య, బాలింగంగౌడ్, నరహరి, పాండు, రాజారాం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల సాధన



వెల్దండ: ఐక్యతతో హక్కులను సాధించుకోవచ్చని కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు కల్యాణం వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో బెడ బుడగజంగం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడబుడల జంగం సంఘం నాయకులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడుదామన్నారు. గ్రామ గ్రామాన బుడగజంగం నాయకులు ఐక్యంగా ఉండి ఉద్యమించాలన్నారు. ప్రభుత్వం అన్ని కులాలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను బేడ బుడగ జంగం వారికి అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ కులానికి న్యాయం చేయాలన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా బహిరంగ సభలను నిర్వహిస్తామన్నారు.

మండల కమిటీ ఎన్నిక

బేడబుడగ సంఘం మండల కమిటీని ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వానరాశి రాములు, ప్రధాన కార్యదర్శిగా రాములు, నాయకులు వెంకటయ్య, శ్రీను, సాలయ్య, బంగారి, శేఖర్, మహేష్, కొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సభ్యులు చిత్తారి శ్రీనివాసులు, కొండపల్లి వెంకటయ్య, జంగయ్య, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాడూరు: మండలంలోని గుట్టలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. గ్రామాన్ని ముందస్తుగా మోడల్ విలేజ్‌గా ఎంపిక చేశారు. రెండు సార్లు సర్వే నిర్వహించి ఇళ్లు లేని వారిని గుర్తించారు. పథకానికి ఎంపికైనవారిని బేస్‌మెంట్ వరకు నిర్మాణ పనులను పూర్తిచేశారు. ఇళ్ల నిర్మాణాల దగ్గర లబ్ధిదారుల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తునట్లు ఎంపీడీఓ తెలిపారు. సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

భక్తిభావంతో మెలగాలి

తెలకపల్లి: ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నడిగడ్డ గ్రామ శివారులో బీరప్ప స్వామి ఉత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు కురుమలు డోలు డప్పులతో స్వాగతం పలికి సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిపల్లి యాదయ్య, వల్లప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బండపర్వతాలు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఈగలపెంటలో



కొల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



కల్వకుర్తిలో..



తాడూరు ఎంపీడీఓ కార్యాలయంలో..



లింగాలలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సోమవారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఊరూరా అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు హాజరయ్యారు. ప్రజాసంఘాలు, కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించి అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాధాకృష్ణ భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ 135 జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్, సంజీవగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ పెంట్లవెల్లి మండలం జటప్రోలులో మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

■ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ రామేశ్వర్ హాజరై అంబేడ్కర్‌కు నివాళులర్పించి మాట్లాడారు. అంటరానితనం పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఆర్ ఏఎస్పీ భరత్, సీఐ కనకయ్య, ఆర్‌ఐ అడ్మిన్ జగన్ పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, డాక్టర్ పగిడాల శ్రీనివాసరెడ్డితో పాటు, బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. యువకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో మెజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి, బార్ అసోసియేషన్ న్యాయవాదులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. శ్రీవాణి విద్యానిలయంలో పేదలకు రంగినేని జగదీశ్వరుడు దుస్తులు పంపిణీ చేశారు. మండలంలోని కుడికిల్లలో వేడుకలు నిర్వహించారు.



నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఏఎస్పీ రామేశ్వర్

■ అచ్చంపేట పట్టణం ప్రముఖ కవి జయరాజ్ పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్దామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

■ తాడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయులుతో పాటు దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

■ తెలకపల్లి, కారువంగతో పాటు పలు గ్రామాల్లో యువజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు, చిన్న జంగయ్య, గాజుల తిరుపతయ్య, గోపస్ లక్ష్మణ్, అమరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లి పెద్దకార్పముల, యాపట్ల, మర్రికల్, ముష్టిపల్లి, వెన్నచర్ల, దేవనితిర్మాలాపూర్, సాతాపూర్ కల్వకోల్, గంట్రావ్‌పల్లి, గ్రామాల్లో బీఆర్ అంబేడ్కర్ 134 జయంతి వేడుకలు నిర్వహించారు. పగిడాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరెడ్డి, దండు నర్సింహ, కృష్ణయ్య, తగిలి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

■ కోడేరుతో పాటు పస్పుల, నర్సాయిపల్లి, జనుంపల్లి, తీగలపల్లి తదితర గ్రామాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

■ కల్వకుర్తి మండలంలో బీజేపీ, బీఆర్‌ఎస్, బీఎస్పీ, కమ్యూనిస్టు పార్టీల తో పాటు ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్‌కు పూలమాల వేసి నినాదాలు చేశారు.

■ ఈగలపెంటలోని జెన్‌కో శక్తిసదన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ(ఓఅండ్‌ఎం)ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్)రవీంద్రకుమార్ తదితరులు పూలమాల వేసి మాట్లాడారు.

■ ఉప్పునుంతల ఎంపీడీఓ కార్యాలయంతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సదగోడు, కాంసానిపల్లి, తాడూరు, మర్రిపల్లి, మామిళ్లపల్లి, వెల్టూరు, కొరటికల్, రాయిచెడ్ తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

■ బల్మూర్, ఊర్కొండ, అమ్రాబాద్, పదర, మన్ననూరు, మాచారం, చారకొండ, లింగాల మండలాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



ఉప్పునుంతలలో



నాగర్‌కర్నూల్‌లో..



కొల్లాపూర్ మండలం కుడికిల్లలో..



కోడేరు మండలం నర్సాయిపల్లిలో..



తెలకపల్లిలో..



మన్ననూరులో..

అంబేడ్కర్ అందరివాడు

కల్వకుర్తి రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత, దేశ తొలి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గుండూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామన్నారు. మాజీ ఎంపీ రాములు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ భరత్ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొన్నారు.

■ వెల్దండలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.



వెల్దండలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అందరికీ సంక్షేమ ఫలాలు



బిజినేపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్/బిజినేపల్లి/తిమ్మాజిపేట: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాల్లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తామన్నారు. కుల నిర్మూలన కోసం నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘ఉపాధి’కి ప్రణాళిక ఖరారు



కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీఓ రాజేశ్వరి

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నియంత్రించి కూలీలకు 100 రోజుల పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో చేపట్టాల్సిన పనుల కార్యచరణ ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. గతంలో గ్రామాల్లో ఉపాధి హామీ పనుల కోసం గ్రామసభలను నిర్వహించిన అధికారులు అందుకు అనుగుణంగా పనిదినాలను ఖరారు చేశారు. మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో ఉపాధి ప్రణాళికను ఖరారు చేసిన అధికారులు పనులు ప్రారంభించారు. మండలంలోని కూలీలకు 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 1.60 లక్షల పనిదినాలను అధికారులు ప్రతిపాదించారు. ఒక్కొక గ్రామాన్ని యూనిట్‌గా ఎంచుకుని ఉపాధి పనులను నిర్వహిస్తున్నారు. కూలీలకు వేతనాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల సాఫ్టవేర్‌ను మార్చి కొత్తగా ఎన్ఐసీ(నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్స్ సెంటర్)ను వినియోగిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల ఆధార్ నంబర్‌కు లింక్ ఉన్న బ్యాంక్ ఖాతాకు కూలీల డబ్బులు జమ చేస్తున్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యత

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా వ్యవసాయ పనులను అధికారులు గుర్తిస్తున్నారు. అందులో భాగంగా చెరువులు, నీటి కుంటలు, పంట కాలువలు, పూడికతీత పనులు, గుంతలు తీయడం, పంట పొలాలకు నూతనంగా రోడ్లు వేయడం లాంటి పనులు గుర్తించారు.

పనులను ప్రారంభించాం



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాం. కూలీల సంఖ్యను పెంచి ప్రతి ఒక్కరికి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. గ్రామాల్లో విస్తృతంగా ఉపాధి హామీపైన ప్రచారం నిర్వహించి కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– చంద్ర సిద్ధార్థ, ఏపీఓ, తాడూరు



హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఘనంగా ఎల్లమ్మ పండుగ

తెలకపల్లి: మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ పండగలు కొనసాగాయి. ఈ నెల 9 నుంచి బండారి, బారిగారి, రెడ్డపాకుల కొమ్ము, కొంగరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం గాంధీ చౌరస్తానుంచి బైండ్ల కళాకారులు రేణుక ఎల్లమ్మ కథలను వివరించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కూడళ్లను ముస్తాబు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అధ్వానపు రోడ్లపై నరక యాతన

- కంకర రోడ్లపై ఇబ్బందిగా ప్రయాణం
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టింపులేని పాలకులు, అధికారులు



ఉప్పునుంతల-కొత్తరాంనగర్ గ్రామాల మధ్య ఇలా..



పూర్తిగా ధ్వంసమైన తాడూరు-ఉప్పునుంతల బీటీ రోడ్డు

ఉప్పునుంతల: మండలంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఏళ్ల తరబడిగా మరమ్మతులకు నోచుకోని రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. కొన్నేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్ల నిర్వాహణలేక పూర్తిగా దెబ్బతిన్నాయి. గ్రామాలను కలుపుతూ ఉన్న అంతర్గత రోడ్లు మరింతగా అధ్వానస్థితికి చేరాయి. రోడ్లను బాగుచేయించడంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టింపులేకుండా ఉంది. గత ఐదారేళ్లుగా మట్టి రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ పెట్టకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షాలకు రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. రోడ్లకు ఇరువైపుల కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. గతంలో మెటల్ రోడ్లుగా వేసి తర్వాత పట్టించుకోకపోవడంతో కంకర లేసిపోయి రోడ్లపై వెళ్లడం కష్టంగా మారింది. ఏడాది క్రితం ఉప్పునుంతల నుంచి లక్ష్మాపూర్, మామిళ్లపల్లి మీదుగా రాకొండ వరకు బీటీ రోడ్డు రెన్యూవల్ మంజూరైనా పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

మట్టి రోడ్లు మరింత అధ్వానం..

ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ రోడ్డు, ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్, మొల్గర-ఉప్పునుంతల రోడ్ల వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర లేసి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న రోడ్డు వెంట కంకర లేసి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దాసర్లపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు, కొరటికల్ నుంచి చాకలి గుడిసెల వరకు మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, అదేవిధంగా కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. కాంసానిపల్లి తండా నుంచి రంగంపేట మీదుగా ఉన్న మెటల్ రోడ్డుపై వేసిన కంకర లేసింది. కంకర రాళ్లతో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కష్టంగా ఉంది.

తూతూ మంత్రంగా బీటీరోడ్ల మరమ్మతులు

మండలంలోని బీటీ రోడ్ల వెంట తూతూ మంత్రంగా నిర్వాహణ పనులు చేస్తున్నారు. పనుల నాణ్యతపై అధికారులు ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి వరకు గతేడాది క్రితం అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా బీటీ రోడ్డును రెన్యూవల్ చేసిన కాంట్రాక్టర్ రోడ్డు అంచుల వెంబడి మట్టి సరిగా వేయకుండా వదిలేశారు. తాడూరు నుంచి ఉప్పునుంతల వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కన్పించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తాడూరు సమీపంలో రోడ్డు పూర్తిగా ఇబ్బందిగా ఉంది. ఈరట్వానిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తండా వరకు ఉన్న బీటీ రోడ్డు కొన్నేళ్ల క్రితం వేసి తిరిగిపట్టించుకోకపోవడంతో గోతులుపడి పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుకు ఇరువైపుల చెట్లపొదలు కమ్ముకున్నాయి.

ఎవరూ పట్టించుకోవడలేదు..



వర్షాలకు రోడ్డుపై గోతులు పడి బైక్‌లు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉంది. నల్లచెరువు కట్టపై చెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు అసలే కన్పించడంలేదు. ఎన్నికల ముందు గ్రామానికి వచ్చిన నాయకులు మాత్రం బీటీ రోడ్డు మంజూరు చేయిస్తామని చెప్పి తర్వాత పట్టించుకోరు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రాని పరిస్థితిలో మా ఊరి రోడ్డు ఉంది.

– గుర్రపు మల్లయ్య, కొత్తరాంనగర్

రెండు రోడ్లు మంజూరు..

మండలంలో కొత్తగా రెండు రోడ్లు మంజూరయ్యాయి. ఉప్పునుంతల నుంచి తాడూరు వరకు ఎస్‌టీఎంసీ నిధులు రూ. 1.26 కోట్లు బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు, ఉప్పునుంతల నుంచి పల్కపల్లి వరకు బీటీ రోడ్డుగా అభివృద్ధి కోసం సీఆర్‌ఆర్ నిధులు రూ. 4.50 కోట్లు మంజూరు అయ్యాయి. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చేతులమీదుగా పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. టెండర్ ప్రాసెస్‌లో ఉంది. అట్టి బీటీ రోడ్డు పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం.

– మహేష్, పీఆర్ ఏఈ, ఉప్పునుంతల